క్లుప్తంగా

సిటీ ప్లానర్‌గా శైలజ

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ సిటీ ప్లానర్‌గా శైలజ నియమితులయ్యారు. కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా)లో డీటీసీపీగా ఉన్న ఆమెను కడప కార్పొరేషన్‌కు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో కూడా ఆమె కడప కార్పొరేషన్‌లో సిటీప్లానర్‌గా పనిచేశారు. ఇక్కడ సిటీ ప్లానర్ ఉన్న రమణను కర్నూలు నగరపాలక సంస్థకు బదిలీ చేశారు.

3న ఎద్దుల ఈశ్వర్ రెడ్డి వర్ధంతి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: స్వాతంత్ర్య సమర యోధులు, పేదల అభ్యున్నతికి నిరంతరం శ్రమించిన ప్రజా సేవకుడు ఎద్దుల ఈశ్వరరెడ్డి 39 వ వర్ధంతి సందర్భంగా ఈనెల 3 వ తేదీన ఆదివారం ఉదయం 10 గంటలకు ఎర్రముక్కపల్లె సర్కిల్‌లో ఘనంగా నివాళులర్పిస్తున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి యస్.వెంకట శివ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఎర్రముక్కపల్లెలో సీపీఐ నాయకులు ఎద్దుల ఈశ్వర్ రెడ్డి వర్ధంతిని జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగార్జున రెడ్డి, వేముల ఓబులేసు, రామకృష్ణ, సీపీఐ నగర సహాయ కార్యదర్శి లు ఉద్దే మద్దిలేటి, శంకర్ నాయక్ కార్యవర్గ సభ్యులు మల్లికార్జున, భాగ్యలక్ష్మి, నాగిరెడ్డి, శివ నాగేంద్ర, నారాయణ తదితరులు పాల్గొన్నారు

అంత్యక్రియలు



మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళుతున్న మేము సైతం సేవాసంస్థ సభ్యులు

కడప అర్బన్: కడప తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో అనారోగ్యంతో అనాధ మహిళ మృతి చెందింది. ఎస్ఐ తులసీనాగప్రసాద్ సిఫారసు మేరకు శుక్రవారం మేము సైతం సేవాసంస్థ సభ్యులు ముందుకు వచ్చి హిందూ సంప్రదాయం ప్రకారం కడప నగరంలోని మోచంపేటలోని హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియలను పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో మేము సైతం సేవాసంస్థ సభ్యులు వంకదారి రాము, హెడ్ కానిస్టేబుల్ అయ్యవారయ్య, గురువయ్య, రామలోకం, రామరాజు, శివరాం, నాగేశ్వరరావు, నీలకంఠ, భాను, పుల్లయ్య పాల్గొన్నారు.

ఆర్‌జేడీకి సన్మానం



ఆర్‌జేడీని సన్మానిస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ నేతలు

కడప ఎడ్యుకేషన్: ఇంటర్ విద్య ఆర్‌జేడీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సురేష్‌బాబును కడప జిల్లా ఎస్సీ, ఎస్టీ జూనియర్ అధ్యాపకుల సంఘ అధ్యక్షుడు చెప్పలి రాజారావు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ జోన్ పరిధిలో ఇంటర్ విద్యతోపాటు కళాశాలల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ కన్వీనర్స్ బాలరాజు, అమృతరాజు, వసంతరావు, దుర్గన్న, సంపూర్ణ, స్వరరూప రాణి, ఓబులమ్మ, సుజాత, డేవిడ్ కోల్ , పోతన్న, సుధాకర్ రాజా తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

వీరపునాయునిపల్లె : మండల కేంద్రంలోని 1వ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసిడియస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యత గురించి తల్లులకు వివరించారు. ప్రతి ఏడాది ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, తల్లులు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని, అవే బిడ్డకు శ్రీరామ రక్ష అని, మొదటి టీకా కూడా అని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత తెలిపారు. కమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని 6వ వార్డు 2వ, చదిపిరాళ్ల దళితవాడ అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలలో ఆమె మాట్లాడారు. ఒక రొమ్ముకు పూర్తిగా పాలిచ్చిన తర్వాతే మరొక రొమ్ము ద్వారా ఇవ్వాలన్నారు. అలా చేస్తే తల్లికి బిడ్డకు ఇద్దరికి మంచిదన్నారు. కాన్పుకు ముందు తీసుకునే ఆహారమే కాన్పు తర్వాత కూడా తీసుకోవచ్చని, పండ్లు అధికంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగేశ్వరీ, వర్కర్లు యశోద, వరలక్ష్మీ, ఆశా, ఏఎన్‌ఎం, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.









కేసీ కెనాల్‌లో కేరింతలు

కడప నగర శివార్లలోని కేసీ కెనాల్‌కు నీరొచ్చాయి. ఇంకేముంది చుట్టు పక్కల ఉన్న బాలురు, విద్యార్థులు అందులో ఈత కొడుతూ కేరింతలు కొడుతున్నారు. అయితే పిల్లల సరదాలు విషాదానికి దారితీయకుండా జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలపై పర్యవేక్షణ ఉంచాలి. - ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

ఘన సన్మానం



రాష్ట్ర వలంటీర్ల విభాగం అధ్యక్షుడు నాగార్జున యాదవ్‌ను సన్మానిస్తున్న వైఎస్ఆర్‌సీపీ నేతలు

కడప కార్పొరేషన్: తొలిసారి జిల్లాకు విచ్చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వలంటీర్ల విభాగం అధ్యక్షుడు నాగార్జున యాదవ్‌ను ఆ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య ఆధ్వర్యంలో సన్మానించారు. ఆయనతోపాటు వలంటీర్స్ విభాగం రాయలసీమ జోన్ అధ్యక్షుడు నిఖిలేష్, కడప నియోజకవర్గ అధ్యక్షుడు వంశీ తదితరులను కూడా సన్మానించారు. పార్టీ అభివృద్ధికి సమన్వయంతో పని చేద్దామని ఆయన పిలుపునిచ్చారు.

5న విద్యుత్ భవన్ ఎదుట ధర్నా



ప్రచారం నిర్వహిస్తున్న వామపక్ష కార్మిక సంఘాల నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈనెల 5న స్మార్ట్ మీటర్ల రద్దు చేయాలని, పెంచిన ఇంధన సర్దుబాటు చార్జీలు ఉపసంహరించుకోవాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విద్యుత్ భవన్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని వామపక్ష కార్మిక సంఘాల నాయకులు నాగ సుబ్బారెడ్డి, మనోహర్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఏడు రోడ్లు సర్కిల్, గోకుల్ సర్కిల్, వన్ టౌన్ మీదుగా ఆర్టీఓ ఆఫీస్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారాన్ని తక్షణమే ఆపకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదంటూనే వినియోగదారుల జేబులకు కత్తెరవేసే టైం ఆఫ్ డే టార్ఫ్ విధానాన్ని చిరు వ్యాపారులకు సైతం అమలు చేస్తామని ప్రకటించడం దారుణమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు రామ్మోహన్, వెంకట శివ, దస్తగిరి రెడ్డి, మద్దిలేటి, సుబ్రహ్మణ్యం, చంద్రారెడ్డి, వెంకట సుబ్బయ్య, మల్లికార్జున, రామకష్టారెడ్డి, గోవిందు, నరసింహ , భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

కడప ఎడ్యుకేషన్: ఈనెల 8, 9, 10 తేదీలలో కలకత్తాలో జరిగే స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ) ఆలిండియా మహాసభలు జయప్రదం చేయాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ మెంబర్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి లక్ష్మి రాజా కోరారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని శుక్రవారం కడప యూటీఎఫ్ భవన్ వద్ద ఎస్టీఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబులు మాట్లాడుతూ ఎస్టీఎఫ్ఐ 9వ ఆల్ ఇండియా మహాసభలు కలకత్తాలో జరుగుతున్నాయన్నారు. ఈ మహాసభలకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొంటారని తెలిపారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని అనేక పోరాటాలు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేసిన చరిత్ర ఎస్టీఎఫ్ఐకు ఉందన్నారు. ఈ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ బి.కృష్ణారెడ్డి, జిల్లా ట్రెజరర్ కే నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఎజాజ్ అహమ్మద్, సికేదిన్నే మండల ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధన ఎందుకు..?

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కాంప్లెక్స్ డీఏపీ కొంటేనే యూరియా అనే నిబంధనను ఎత్తివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంప్లెక్స్, డీఏపీ కొంటేనే యూరియా ఇస్తారనే నిబంధన వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఏవి అవసరమో.. వారు ఏవి కావాలంటే అవి ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ.రామ్మోహన్, బి.మనోహర్, వి.అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో ధర్నాను జయప్రదం చేయండి



ఫ్యాప్టో సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 2వ తేదీ కడప కలెక్టరేట్ వద్ద నిర్వహించే ఫ్యాప్టో ధర్నాను జయప్రదం చేయాలని ఈపీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా పిలుపునిచ్చారు. కడప ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య పార్ట్ 2 ప్రాంతీయ మండలాల సమావేశం శుక్రవారం కడప యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఫ్యాప్టో నాయకులు బి లక్ష్మి రాజా, సయ్యద్ ఇక్బాల్, ఎస్ ఖాదర్ బాషా, చెన్నకేశవరెడ్డిలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీ - ఫోర్‌ను ఉపాధ్యాయులకు అమలు చేయరాదన్నారు. అలాగే నూతనంగా అప్డేట్ అయిన స్థానాలను కోరుకున్న ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని, దీంతోపాటు పెండింగ్ ఉన్న కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే 12వ వేతన సవరణ కమిషన్‌ను వెంటనే నియమించాలని, తక్షణం మధ్యంతర భృతి 30 శాతాన్ని ప్రకటించాలన్నారు. వీటితోపాటు మిగతా సమస్యలను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు కే నరసింహారావు, రామచంద్రారెడ్డి, గురమయ్య, ఎజాజ్ అహ్మద్, జయరామయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టీఐపై అవగాహన అవసరం



విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్ సలీంబాషా తదితరులు

కడప ఎడ్యుకేషన్: సమాచార హక్కు చట్టంపై విద్యార్థి దశలోనే అవగాహన పెంచుకోవడం అవసరం అని ఆర్‌టీఐ పరిశోధకులు, వైవీయూ జర్నలిజం శాఖ అధ్యాపకులు తుమ్మలూరు సురేష్‌బాబు పేర్కొన్నారు. కడపలోని ఎస్ కే ఆర్ అండ్ ఎస్ కే ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం నోడల్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం–2005పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీం బాష అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాచార చట్టం పుట్టుక, చారిత్రిక నేపథ్యం గురించి విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాషా, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ డిప్యూటీ చీఫ్ ఎం. శాంత మాట్లాడుతూ ఉన్నత విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా సమాచార హక్కుచట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తోందన్నారు. సమాచారం హక్కు చట్టం (ఆర్ టి ఐ యాక్ట్- 2005) అమలులోకి వచ్చిన 20 ఏళ్లు అవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. జిల్లాలోని 7 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులు వ్యాసరచన, ఉపన్యాసం, చర్చ (డిబేట్), క్విజ్ పోటీలు ఆర్టిఐ యాక్ట్ ప్రాముఖ్యత, పారదర్శకత, ప్రజా బాధ్యతలపై దృష్టి అంశాలపై పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీలలో మొదటి స్థానంలో ఎస్ నరసింహ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదుకూరు), ఉపన్యాసంలో మొదటి స్థానంలో కే మౌనిక రత్న(ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల పులివెందుల), డిబేట్ విభాగంలో మొదటి స్థానంలో షేక్ జేబా, అఖిఫా బాటల్ (ఎస్ కే ఆర్ అండ్ ఎస్ కే ఆర్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల (అటానమస్) కడప), క్విజ్‌లో మొదటి స్థానంలో పూజిత, కీర్తి, సాలమ్మ, (ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల పులివెందుల) విజేతలుగా నిలిచి జోనల్ స్థాయి పోటీలకు అర్హత సాధించారు

తల్లిపాలు అమృతంతో సమానం



తల్లిపాల ప్రాధాన్యత తెలియజేస్తున్న ఐసీడీఎస్ పీడీ రమాదేవి తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : తల్లిపాలు అమృతంతో సమానమని ప్రతి తల్లి గుర్తించి బిడ్డ పుట్టిన వెంటనే పాలు పట్టించాలని ఐసీడీఎస్ పీడీ రమాదేవి తెలిపారు. శుక్రవారం భాకరాపేట అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా గర్భవతులు, బాలింతలకి తల్లిపాల మీద అవగాహన కల్పించారు. పీడీ మాట్లాడుతూ ముర్రు పాలు ఎంత ముఖ్యమో 9వ నెల గర్భవతుల ఇంటికి వెళ్లి తెలియజేశారు. అలాగే ఆరు రోజుల కిందట డెలివరీ అయిన బిడ్డ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాలు పట్టే విధానం, తల్లిపాల ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలే పట్టాలని, పుట్టిన గంటలోపే ముర్రుపాలు తాగించాలన్నారు. అలాగే తల్లికి పాలు పడడానికి తీసుకోవలసిన ఆహారం గురించి తెలియజేశారు. సీడీపీఓ వాణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హాస్టల్ సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన



కలెక్టరేట్ పరిపాలన అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరం ప్రకాశ్‌నగర్‌లో ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ హాస్టళ్లలో చాలా కాలంగా తిష్టవేసిన సమస్యలను అధికారులు పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు పసుపులేటి సాయిదత్త అన్నారు. శుక్రవారం ఈ అంశంపై కలెక్టరేట్ పరిపాలన అధికారి కె.వి జయ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. సాయిదత్త మాట్లాడుతూ హాస్టళ్లలో సౌకర్యాలు చాలా అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. ఎస్సీ ఎస్టీ హాస్టళ్లలో విద్యార్థులకు వడ్డించే ఆహారంలో పురుగులు వస్తున్నాయని తెలిపారు. చికెన్ తక్కువగా వడ్డిస్తున్నారని చెప్పారు. వర్షం వస్తే గదుల్లో నీరు కారుతోందని చెప్పారు. కిటికీలకు అద్దాలు లేవని, విద్యార్థులకు విషజ్వరాలు వస్తున్నాయన్నారు. బీసీ హాస్టల్‌లో కరెంటు బోర్డులు ప్రమాదకరంగా మారాయన్నారు. చాలా బాత్‌రూములకు వాకిళ్లు లేవన్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాం మంచాల, కడపజిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షులు వెంకటేశ్వర్లు, బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు శివరాం, ఎస్సీ నాయకులు సీహెచ్ వినోద్, విద్యార్థి విభాగం కడప నగర అధ్యక్షులు శివారెడ్డి, ఉపాధ్యక్షుడు షేక్ జబ్బార్, ప్రధాన కార్యదర్శి విష్ణు వర్ధన్, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సుమంగళి పూజ



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గమ్మ



సుమంగళి పూజ ఆచరిస్తున్న భక్తులు

కడప సెవెన్‌రోడ్స్ : శ్రావణమాసం రెండవ శుక్రవారం సందర్భంగా కడప నగరంలోని విజయదుర్గమ్మ ఆలయంలో సుమంగళి పూజను నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఉత్సవ మండపంలో వేద పండితులు సుమంగళి పూజ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. రాత్రి అమ్మవారికి పల్లకీ సేవ చేపట్టారు. ఈనెల 8వ తేదిన వరలక్ష్మీవ్రతం వైభవంగా నిర్వహించేందుకు, 9వ తేది శ్రావణ పౌర్ణమి నాడు, అలాగే 10వ తేది శ్రీ విజయదుర్గ సమేత మల్లికార్జునస్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

యోగాతో ఒత్తిడిని తగ్గించుకోవాలి

వేంపల్లె : ఒత్తిడి అనేది గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది, కాబట్టి విద్యార్థులు ఒత్తిడిని తగ్గించుకోవడంతోపాటు యోగా, ధ్యానం, ఇతర ఒత్తిడి తగ్గించే పద్ధతులను అనుసరించడం మంచిదని గుండె జబ్బుల నిపుణుడు డాక్టర్ శ్రావణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఇడుపులపాయలోని ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో కడపకు చెందిన వేదాంత ఆసుపత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు గుండె జబ్బులపై అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే గుండె పోటు వచ్చిన వ్యక్తికి సీపీఆర్, లైఫ్ సపోర్ట్ విధానంపై డెమో ద్వారా విద్యార్థులతో చేయించి చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండె జబ్బులను ముందుగానే గుర్తించడానికి రెగ్యులర్ హెల్త్ చెకప్‌లు చేయించుకోవడం చాలా ముఖ్యమన్నారు. ప్రస్తుతం చిన్న వయస్సు వారికి కూడా గుండె జబ్బులు సోకి మృత్యువాత పడుతున్నారన్నారు. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలపాటు వ్యాయామం చేయడం గుండె ఆరోగ్యానికి మంచిదన్నారు. ఆకస్మాతుగా వ్యక్తి పడిపోతే చదునైనా నేలపై పడుకోబెట్టి పల్స్ చెక్ చేసి వెంటనే సీపీఆర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, డీన్ రమేష్ కైలాష్, ఎస్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ దీప్తి, పీఆర్ఓ తిరుపతి రెడ్డి, ఆర్కేవ్యాలీ వైద్యులు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నూతన విధానాన్ని అమలు చేయాలి

కమలాపురం : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అప్లికేషన్ విధానాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని ఆ పథకం ఏపీడీ సుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో దు కమలాపురం, వల్లూరు, ఎర్రగుంట్ల మండలాల టీఏ, ఎఫ్ఏలకు నూతన అప్లికేషన్ అమలు చేసే విధానంపై ఆయన శిక్షణ నిచ్చారు. ఉపాధి హామీ పథకంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం నూతన అప్లికేషన్ విధానం ప్రవేశ పెట్టిందన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఈ విధానాన్ని క్షేత్రస్థాయిలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఉపాధి హామీ కూలీల హాజరు ఎన్ఎంఎంఎస్, ఫేస్, ఆధార్ అథెంటికేషన్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అలాగే ఉపాధి పనుల జియో ట్యాగింగ్ విధానంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పవర్ పాయింట్ ప్రొజెక్టర్ ద్వారా సిబ్బందికి శిక్షణ నిచ్చారు. అనంతరం రీసోర్స్ పర్సన్లు అన్నా నాయక్, ఉపేంద్రరెడ్డిలు, కోర్స్ డైరెక్టర్ వెంకట సుబ్బయ్యలు పలు అంశాలపై శిక్షణ నిచ్చారు.

స్ట్రాంగ్ రూముల పరిశీలన

పులివెందుల రూరల్ : ఈనెల 12న పులివెందుల జెడ్పీటీసీ స్థానానికి సంబంధించి ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే పోలింగ్ బాక్సులు పులివెందులకు చేరాయి. పట్టణంలోని స్థానిక ముద్దనూరు రోడ్డులో ఉన్న జేఎన్‌టీయూ కళాశాలలో పోలింగ్ బాక్స్‌లను భద్రపరిచారు. ఈ సందర్భంగా సీఐ చాంద్‌బాషా, ఎంపీడీఓ కృష్ణమూర్తి, తహసీల్దార్ నజీర్ అహ్మద్‌లు కళాశాల ప్రిన్సిపాల్‌తో కలిసి జెఎన్‌టీయూలోని స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. బయట కూడా సీసీ కెమెరాలతోపాటు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని వారు సూచించారు.

రాహుకాల పూజలు

రాయచోటి టౌన్: రాయచోటి భద్రకాళీ అమ్మవారికి రాహుకాల పూజలు శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈవో డీవీ.రమణారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శంకరయ్యస్వామి, కృష్ణ స్వామి, రాచరాయయోగీ స్వామి అమ్మవారిని రంగు రంగుల పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, నిమ్మకాయల హారాలతో అలంకరించారు. మహిళలు నిమ్మకాయలపై వత్తులు వెలిగించి హారతులు పట్టారు.

మాట నిలబెట్టుకోవాలి

పోరుమామిళ్ల: స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, విద్యుత్ చార్జీలు తగ్గించాలని ఈ విషయంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సీపీఐ ఏరియా కార్యదర్శి మస్తాన్, మండల కార్యదర్శి రవికుమార్ డిమాండ్ చేశారు. కార్యకర్తలతో కలసి శుక్రవారం పట్టణంలోని ప్రతి దుకాణం వద్దకు వెళ్లి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని వివరించారు. స్మార్ట్ మీటర్ల ఆదాయం అదాని ఆస్తులు పెంచేందుకు బీజేపీ పని చేస్తున్నదన్నారు. టీడీపీ ప్రజలకు అన్యాయం చేయడంలో ముందున్నదన్నారు. ప్రజలకు ఎలాంటి ఉపయోగంలేని స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని ఈనెల 5న కరెంటు కార్యాలయాల వద్ద జరిగే ధర్నా లో అందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయుసీ, ఇన్సాబ్, మహిళా సంఘాల నాయకులు చెన్నయ్య, సఫా, చాంద్‌బాష, శ్రీనివాసులు, విశ్వాసమ్మ, షాహిదా, ఆదెమ్మ, గురమ్మ, రామసుబ్బయ్య పాల్గొన్నారు.